# విద్యయామృత మశ్నుతే

విద్యార్థులంతా జలపాతంలా మెట్లమీంచి దూకుతూ వచ్చేస్తున్నారు. నీటితుంపర పొగలా ఎటుచూసినా దుమ్ము - కిందికి రాగానే వాళ్ళ కాళ్ళు లేపిన దుమ్ము.

జలపాతం ఆగినట్టు కొంచెంసేపు - ఆ తర్వాత చిన్నచిన్న కెరటాల్లా మరి కొంత మంది పిల్లలు, వ్యాపిస్తున్న దుమ్ము నలువైపులా చెట్ల మీదికి పాకి పోతున్నది.

అపుడు మధ్యాహ్నం ఒంటిగంట. లంచ్ కోసం బయటికి వచ్చేసిన పిల్లలు అటూ ఇటూ చెదిరి పోయారు.

ఈ దేశ స్వాతంత్ర్యంతో బాటే పుట్టి పెరిగిన ఆ స్కూలు మీద కొందరికి బయటి నుంచి పెద్ద జైలులా కనిపిస్తుంది. దాని రాతి గోడల సందుల్లో వున్న సిమెంటు-సున్నంలో ప్రజల డబ్బు, ఉపాధ్యాయుల శ్రమదాగి వుంది. ఆ భవనం పేరు నర్శింహ్మారావు మెమోరియల్ హైస్కూలు.

బయటి గేటు దాటి ఆవరణలోకి ప్రవేశిస్తే విశాలమైన మెట్లుఎక్కుతూ పైకి చూస్తే ముఖద్వారంపై అజంతా గుహా చైతన్యంలా సిమెంటు నిర్మాణం. అక్కడే తలమానికంగా పెద్దపెద్ద అక్షరాలతో ఆహ్వానించే సంస్కృత వాక్యం - "విద్యయామృత మశ్నుతే"

ఆ స్కూల్ రెండో అంతస్థుపై ప్రకాశం నిలుచుని చుట్టూ చూస్తున్నాడు. గడిచిపోయిన ఇరవై ఏళ్ళలో కొత్త మేడలు - థియేటర్లు చాలానే పుట్టుకొచ్చాయి. ఒకనాటి చిన్న డాక్టరు ఇప్పుడు పెద్ద నర్శింగ్ హోం కట్టి లక్షలు గడిస్తున్నాడు. పక్కనే వున్న రైల్వే కాంట్రాక్టర్ కోటలాంటి పెద్దబిల్డింగ్ లేపాడు.

ప్రకాశానికి ఎప్పటిలానే ఒక వెలితి లోపల తన్నుకుంటోంది. కెరీర్ దృష్ట్యా చిన్న చిన్న అంగాలతో నడిచి వచ్చిన జీవితం అక్కడే ఆగిపోయింది. రోజూ సైకిల్ పైనే చెమటలు కారుస్తూ స్కూలుకి రావడం తప్పలేదు. ఇరవై సంవత్సరాల సర్వీసులో పిల్లలకు సోషల్ స్టడీస్ పాఠాలు చెబుతూనే ఎప్పుడూ సమయానికి రాని నెల జీతానికి జీవితం ఆధీనమై పోయింది. ఇప్పుడేమో మూడు నెలల నుంచి జీతాలు అందలేదు. ఈ సాయంత్రమే డి. యీ. వో. కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన చేయవలసి వుంది.

ప్రకాశం దృష్టి ప్రిన్సిపాల్ గదిపై నిలిచింది. గత ముప్పై సంవత్సరాల నుంచి ఆ గదిలో కూచుని రాజ్యం చేస్తున్న ప్రధానోపధ్యాయుడు భగీరథస్వామి తీరిగ్గా పేపరు చదువుకుంటున్నాడు.

అప్పుడే ఆ గదిలోంచి బయటికి వచ్చిన

## నిఖిలేశ్వర్



రాజారావు మేష్టారు మెట్లు దిగి పోతున్నారు.

రాజారావుని కలుసుకుందామని ప్రకాశం గబగబా పైనుంచి కిందికి దిగి వచ్చాడు. ఆయన గేటు దాటుతుండగా వెళ్ళి కలుసుకున్నాడు.

చేతిలోగొడుగు, లాల్చీ ధోవతితో ఎర్రగా పొట్టిగా వున్న రాజారావు ఇటీవలే ఇంగ్లీషు టీచరుగా రిటైర్ అయిపోయాడు.

ఆయన సర్వీసులోని పాతకాలంనాటి ప్రావిడెంటుఫండ్ డబ్బు కొంత స్కూలు మేనేజిమెంటు దగ్గరే వుండిపోయింది. ఇంత వరకు లెక్క తేలలేదు. మరి కొంతడబ్బు పోస్టాఫీస్‌లో వుంటే తీసేసుకున్నాడు.

ప్రకాశం వెనకాలనుంచి - "రాజారావు గారు నమస్కారం!" అని అరిచాడు.

రాజారావు మేష్టారు చటుక్కున ఆగి వెనక్కి తిరిగి నిలుచున్నాడు. "ప్రకాశం బాబూ కులాసాయేనా?" అని పలకరించాడు.

"ఇంతకు మీ పి.యఫ్. లెక్క తేలినట్టేనా?" దగ్గరగా వచ్చి ప్రకాశం అడిగాడు.

"ఏం లెక్కనోపాడో! ఈ ప్రిన్సిపాల్ భగీరథస్వామి నా ప్రాణం తోడేస్తున్నాడయ్యా బాబు, నెలరోజుల బట్టి తిప్పుతున్నాడు. ఎంతకూ లెక్క తేల్చడు. నేను

ఈ పెన్షన్ సెటిల్ కానంతవరకు ఎలా బత కాలో ఏమో అర్థం కావడంలేదు ?" అదు ర్దాగా తన భయాన్ని వెలిబుచ్చాడు రాజా రావు.

"అదేం మాష్టారు ! అలా నిరుత్సాహ పడిపోతారేంటి ? మీ డబ్బులు ఎక్కడికి పోతాయి ? మేమంతా ఉన్నాంకదా !" అని ప్రకాశం హామీ ఇచ్చాడు.

"ఏం లాభమండి బాబు !" అని నిట్టూ ర్చాడు రాజారావు నిస్సత్తువగా ! ఎర్రబడిన ముఖంపై చిరుచెమట్లు.

రాజారావును కాఫీకోసమని హోటల్ వైపు నడిపించాడు ప్రకాశం.

కాఫీ తాగుతూ రాజారావు మేష్టారు కళ్ళ ద్దాలను లాల్చీతో తుడిచాడు. మళ్ళీ అద్దాల జోడు ముఖానికి తగిలిస్తూ అడిగాడు.

"ప్రకాశం ! ఇంతకూ నా పి.యఫ్. డబ్బులు ఈ స్కూలు మేనేజిమెంటువాళ్ళు ఇస్తారంటావా ?"

"అదేమిటండి అలా అడుగుతారు ? ఇవ్వ కుండా ఎక్కడికి పోతారు ? లెక్కలు తేల గానే మొత్తం డబ్బు ఇవ్వకుండా ఏం చేస్తారు ?" ప్రకాశం ఎదురుప్రశ్న వేశాడు.

"ఏమిటో ప్రకాశం ! ఈ ప్రిన్సిపాల్ భగీరథస్వామి వాలకం చూస్తుంటే అయోమయంగా వుంది. ఆయనకేమయ్యా ! స్కూలుకు ముప్పై ఏళ్ళబట్టి రథసారథి ! ఆ రోజుల్లో ఆయన దగ్గర ఏముండేదని ? అద్దెయిల్లు, ఒక పాతసైకిలు తప్ప ! స్కూలు గోడలు లేస్తూ వుండగానే క్రమంగా అటు భగీరథస్వామి మేడ గోడలు లేచాయి. ఇంత పెద్ద స్కూలును ఆదర్శంగా తీర్చి దిద్దాడనే పేరు పొందాడు. అటు పది లక్షలకు తక్కువ కాని మేడ సంపాదించాడు. అదంతా ఆయన జీతం సంపాదనతోనే కట్టాడంటావా ? ఎవ రైనా నమ్మగలడా ? నేను ఇరవై సంవత్స రాల సర్వీసు తర్వాత వయస్సు పైబడి రిటైర్ అవుతే నాకు మిగిలిందేమిటి ? అదే పాత అద్దెకొంప - స్వయంపాకం-దిక్కులేని బతుకు !" రాజారావు ఆవేదనతో చెప్పాడు.

ప్రకాశం ఆయనకు ధైర్యం చెప్పి బయ టికి వచ్చాడు. "రేపు మళ్ళా స్కూలుకి రావాలి. తాడోపేడో ఏదో తేల్చేదాకా కద లను" అంటూ రాజారావు వెళ్ళిపోయాడు. స్కూలు బడ్డీలా సూటిగా జీవితాన్ని గడిపిన రాజారావు ఇప్పుడు ఒంటరిగానే వుంటు న్నాడు. ఇరవై ఏళ్ళ క్రితమే భార్య పోయింది. వున్న ఒక్క కూతురు వివాహం కాగానే చాలా దూరప్రదేశానికి వెళ్ళిపోయింది.


రిటైర్ అవుతాననగా చరిత్రలో ఎమ్.ఏ. పరీక్ష ప్రయివేటుగా రాసి థర్డ్‌క్లాసులోనే పాసయ్యాడు రాజారావు.

"యూనివర్సిటీ ప్రొఫెసర్లు ప్రయివేటు అభ్యర్థులకు ఎంత బాగా రాసినా ఫస్ట్‌క్లాస్ ఇచ్చి పుణ్యంకట్టుకునే పాపానికివాడిగట్టరు." అని రాజారావు తన రిజల్ట్సు చూసి మిత్రు నితో కోపంగా అన్నాడు అప్పట్లో.

"ఈ రోజుల్లో ఒక్క హైస్కూలు కుర్రాడు ఇంగ్లీషులో కరెక్టువాక్యం రాయ లేడు. ఛీ...ఛీ... చదువంతా భ్రష్టాలమై పోయింది !" రాజారావు బాధపడేవాడు.

"మీరెందుకండి అంత బాధ పడిపోతారు. వీళ్ళే రేపు మన మంత్రులైపోయి మన తల లపై కూచుంటారు" ప్రకాశం సమాధానం చెబితే — "అందుకే దేశం ఇలా తగలడి పోయింది" రాజారావు ఆక్రోశం వెలిబుచ్చే వాడు.

అన్నిట్లో నిజాయితీపరుడైన రాజారావు నిజంగా చాదస్తుడు కొన్ని విషయాల్లో. మాస పరీక్షల నోటుపుస్తకాలు దిద్ది మార్కులలిస్టు తయారుచేసి ఆదివారం సెలవురోజైనా ఆ క్లాస్‌టీచర్ ఇంటికి వెళ్ళి అతను ఇంట్లో లేక పోతే ఆ టీచర్ ముసలి తండ్రికి ఆ లిస్టు అప్పజెప్పి ముట్టినట్టు ఆయన సంతకం తీసు




కొని తన డ్యూటీ సకాలంలో సక్రమంగా నిర్వహించానని తృప్తిగా నిద్రపోయేవాడు.

ఆరోజు సాయంత్రం 4.30 గంటలకు డి.యి.వో. ఆఫీసు ముందు ఉపాధ్యాయులు ధర్నా జరుపుతున్నారు. నర్సింహ్మారావుమెమోరియల్ స్కూల్‌లాంటి ఇతర ఎయిడెడ్ పాఠాశాలల ఉపాధ్యాయులు మూడు నెలల నుంచి జీతాలురాక నానా ఇబ్బంది పడి చివరికి విసిగి ఈ రోజు నిరసన ప్రదర్శన చేస్తున్నారు.

పెల్లులూడుతున్న ఒక పాతకాలం నాటి భవనంలో జిల్లా విద్యాశాఖాధివారి (డి.యి.వో) కార్యాలయం. బయట బెంచీలపై ఇంటర్వ్యూల కోసం పడిగాపులు పడివున్న కొందరు మేష్టార్లు - కూచునే చోటులేక చింతచెట్టు కింద మరో వైపు కొందరు!

"ఏందయ్యాబాబు! చీటీ పంపించి గంట గడచి పోయింది, డి.యి.వో. గారిని కలుసుకోగలనా లేదా?" వోపిక నశించిన ఒక పంతులుగారు ప్యూనును అడుగుతున్నాడు.

అక్కడే పక్కన కూచున్న ఒక గవర్నమెంటు హైస్కూలు హెడ్‌మాస్టర్ మాధవయ్య చాలా కాలం తర్వాత కలసిన మిత్రుడు వెంకట సుబ్బయ్యతో నింపాదిగా కబుర్లు చెబుతున్నాడు. వెంకటసుబ్బయ్య కూడా ఒక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడే!

"మాధవయ్యా, నీదయ్యా అదృష్టమంటే! ఎప్పుడైనా స్కూలుకు రోజూ వెళ్ళి నీ అసిస్టెంట్లు అసలు పాఠాలు చెబుతున్నారా లేదా అని పరిశీలించావా పోనీ నీవైనా నీ వంతు పాఠాలు చెబుతున్నావా? ఇవేమీ చేయకుండానే హాయిగా నెల జీతం పుచ్చుకుంటున్నావ్!"

"సర్లే లేవయ్యా! నేనేదో రోజూ వెళ్ళక ఈ డి.యి.వో. ఆఫీసుచుట్టూ డ్యూటీ చేస్తే-మరి నువ్వు చేస్తున్నదేమిటి? స్కూలుకు మొక్కుబడిగా వెళ్ళినా పిల్లలకు ఎప్పుడైనా పాఠాలు చెప్పిన పాపాన పోయావా? ఆ స్టాఫ్ రూంలో పేకాడడం తప్ప!"

"ఇంకా మనం నయం! ఆ యూనివర్సిటీల్లో వేలకువేలు జీతాలు పుచ్చుకుంటూ, సూట్లూ వేసుకుని కార్లలో తిరిగే ప్రొఫెసర్లు వారానికి ఒక్క పీరియడైనా సరిగ్గా చదువు చెబుతున్నారా?"

వాళ్ళ పక్కనే కూచున్న ప్రకాశానికి ఈ సంభాషణ వినబడింది. ఈ వ్యవస్థలో పుట్టి పెరిగిన తర్వాత ఎంత చదువుకున్నా ఇక్కడి

బలహీనతలు అంటకుండా ఎలా వుంటాయి ? ఉపాధ్యాయులు కూడా మామూలు మనుషులే కదా వృత్తి ప్రత్యేకతను మినహాయిస్తే అని పించింది.

విద్యాలయాలు దేవాలయాలకంటే పవిత్రమైనవని ప్రకాశం ప్రగాఢంగా నమ్మినవాడు. అందువల్లనే ఒక ఉత్తమ ఉపాధ్యాయుడు వెయ్యి మంది పూజారులకంటే ఎంతో మేలు చేస్తాడనే భావంతో ఈ వృత్తిలో చేరాడు.

"మరి ఆ నమ్మకానికి ఇప్పుడు చేదలు పడుతోందా ? విద్యాలయాలు కూడా దేవాలయాలుగానే ఏదో పూజా పునస్కారాల తంతు కోసమే మిగిలిపోయినట్టా ?"

"ఉపాధ్యాయులువృత్తి రీత్యాఏవో అర్చన శ్లోకాలు జపించినట్టు జీతం కోసం మాత్రమే మిగిలిపోతే ?" ఈ ప్రశ్నలు తరుచుగా ప్రకాశాన్ని పీడించేవి.

ప్రకాశం కళ్ళ ఎదుటే చాలామంది టీచర్ల జీవితం బెల్లు - బిల్లుకే పరిమితమై పోయింది!

ఒకప్పుడు "ఫ్యూచర్ లేని టీచర్ బతుకు" అని వెక్కిరించినా ఇప్పుడు కనీసం మధ్య తరగతి మర్యాదలను కొనుక్కోడానికి సరిపోతోందికదా

'బతకలేని బడిపంతులు' ఆ నాటి అరిగిపోయిన మాట. 'బతక నేర్చినవాడే ఇప్పటి టీచర్ - ఈ నాటి లౌక్యం తెలిసిన వాడి బాట ః అని కొందరు ఎత్తి పొడిస్తే' విన్నాడు.

ఆవరణలో కలకలం బయలుదేరింది. మండుతున్న ఎండ కింద నానాదాలు చిటపట మంటూ పేలిపోతున్నాయి.

"మా జీతం బకాయిలు వెంటనే చెల్లించాలి."

"డి.యి.వో. ఆఫీసులో లంచగొండితనం నశించాలి."

నినాదాలు హోరు పెరిగింది. ఆ పాత మేడ దద్దరిల్లినట్టు అనిపించింది.

కార్యాలయం సిబ్బందిలో కొందరు బయటికి పరుగెత్తుకొచ్చి నిలుచున్నారు.

ప్రకాశం ఆకార్యాలయం మెట్ల పై భాగం మీదనించుని ఆవేశంతో ఉపాధ్యాయుల్ని ఉద్దేశించి ప్రసంగం ప్రారంభించాడు.

"మన దేశంలోని ఈ నాటి విద్యా వ్యవస్థ దారి పక్కన పడున్న ఎద్దులా వుంది. దారిన నడిచే ప్రతివొక్కడూ ఆ ఎద్దును తన్నేవాడే, అలానే ప్రతి అధికారి మనకు ఆదర్శాలు - చెప్పేవాడేతప్ప మనజీతాలగురించి సకాలంలో ఏమీ చెయ్యరు ! ఎద్దును తన్నినప్పుడల్లా అది కొంచెం ముందుకు కదులుతుంది, ఆ తర్వాత మళ్ళీ ఆగినచోటే కూలబడుతుంది. ఇపుడు చదువు చెబుతున్న మనం బిల్లులు పాస్కాక ఈ డి.ఇ.వో. క్లర్కుల లంచగొండి తనానికి బలవుతున్నాము ..."

మధ్యలోనే—

"డి.యి.వో. క్లర్కుల అవినీతి నశించాలి" అని ఒక్కసారే మూకుమ్మడిగా నినాదం మోగింది.

ఆ నినాదం వినగానే అక్కడే నిలుచున్న ఆఫీసు సిబ్బంది వొళ్ళు మండింది. వాళ్ళలో కొందరు మరింత ముందుకు పరిగెత్తుకొచ్చి-

"టీచర్ల దౌర్జన్యం నశించాలి" అని అరవడం మొదలు పెట్టారు.

"డి.యి.వో. డౌన్‌డౌన్" అని ఎదురు నినాదాలు మోగిపోయాయి.


ఆ గందరగోళం - తోపులాట కొంత సేపు సాగింది. కేకలు-అరుపులు పెరిగాయి.

లోపలినుంచి డి.యి.వో. బయటికి అడుగు పెట్టాడు అప్పుడు.

ఆయనను చూడగానే సద్దుమణిగింది.

ప్రకాశంను, మరికొంతమంది ఉపాధ్యాయ ప్రతినిధుల్ని పిలిచి లోపలికి తీసుకెళ్ళిపోయాడు.

ఏవో సిబ్బంది ఇబ్బందులు, పై ఉన్నత విద్యాశాఖాధికారి ఆలస్యం - బడ్జెట్ పాస్‌కాకపోవడం - తన ఇబ్బందులన్నీ డి.యి.వో.




యథావిధిగా ఏకరువు పెట్టాడు.

వారం రోజుల్లో జీతాలు అందుతాయని హామీ ఇచ్చాడు.

రాత్రి పడుకునేముందు ప్రకాశానికి విద్యారంగం గురించి ఆలోచనలు చుట్టుముట్టాయి. పవిత్రమైన విద్యాబోధన అనే ఆదర్శంతో చేరిన ప్రకాశానికి వీరభద్ర శాస్త్రిగారి వాదన జ్ఞాపకానికి వచ్చింది. వేదాలు చదువుకొని ఇప్పుడు సీనియర్ తెలుగు పండితుడుగా పని చేస్తున్న శాస్త్రిగారికి కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి.

వీరభద్ర శాస్త్రిగారితో ఎంత వాదించినా ఆయన అభిప్రాయాలుమాత్రం మార్చుకోడు. వెనక ఎప్పుడో ఒక ఆదర్శ లోకముండేదనే భావంతో ఆయన తర్కిస్తాడు. ఆ మాటలు ఇప్పుడు ప్రకాశం చెవుల్లో మారుమోగుతున్నాయి.

ఈ భౌతికంలోంచి అది భౌతికం పుట్టిందనే యదార్థాన్ని ఆయన ఏమాత్రం అంగీకరించకుండా శంకరాచార్యుల "జగమ్ మిథ్య" తత్వాన్ని ఇలా సమర్థిస్తాడు.

"మార్పులేని అలౌకిక తత్వంనుంచి ఈ జడపదార్థం ఉద్భవించింది. ఈ జగత్తు పరివర్తన శీలమైంది. కాబట్టి జగమ్మిథ్య — భౌతిక సుఖాలను మాత్రమే సమకూర్చేది ఒక విధంగా అవిద్యే. అదే ఇప్పటి వైజ్ఞానిక విద్య - ఇది మారుతూ వుండక తప్పదు- ఇదే సర్వస్వమని బతకరాదు. ఆత్మజ్ఞానాన్ని బోధించే విద్యను అభ్యసించాలి. అదే నిజమైన విద్య. అప్పుడే - "విద్యయామృతమశ్నుతే" - విద్యవల్ల అమృతం పొందవచ్చు."

"ఇప్పుడేమో విద్యవల్ల ఎంత ధనం ఆర్జించ గలిగితే అంత ప్రయోజకత్వం - ధనమే అమృతం - అందువల్లే డబ్బుకి ఊడిగం చేస్తున్నది ఈనాటి విద్య! మనమూ అందుకే ఈ ఊడిగం చేయడం! ఇలా సకాలానికి రాని జీతాలకోసం...ఏదో ఆ కాస్సేపు సిలబస్ ప్రకారం చదువు చెప్పి చేతులు దులుపుకునే వాళ్ళను 'గురువు'లని భావించగలమా?" అని ప్రశ్నించేవాడు శాస్త్రి నిర్మొగమాటంగా ... అయితే ఆయన మనుమడుమాత్రం పబ్లిక్ స్కూల్లో ఇంగ్లీషు మీడియమ్‌లో చదువుతున్నాడు.

మరుసటిరోజు స్కూలులో యథావిధిగా తరగతుల్లో పాఠాలు చెబుతున్నారు టీచర్లు. స్టాఫ్‌రూమ్‌లో కొందరు నోటుబుక్కులు దిద్దుతూవుంటే మరికొందరు కబుర్లు చెప్పుకుంటున్నారు. పీరియడ్‌లు గడచిపోతున్నాయి.

ప్రకాశం క్లాసులో తనపీరియడ్ ముగించుకొని కిందికి వచ్చాడు. ప్రిన్సిపాల్ రూమ్ ఎదుటే నిలుచుని ఉండగా ముఖద్వారంలోంచి రాజారావు మేష్టారు లోపలికి తమ గొడుగుతో బాటు వచ్చారు. ప్రకాశంను పలకరించి బయటే గొడుగును గోడకానించాడు.

ఆయన డ్యూటీలో వుండగా ప్రిన్సిపాల్ గారంటే భయం భయంగానే ప్రవర్తించేవాడు. తనకెలాంటి మాట రావద్దని చిత్త

తుద్దిని మించి పాఠాలుచెప్పి బండ్లకొద్ది నోటు బుక్కులు దిద్దినవాడే! ఇపుడు : అదే అణకువతో లోపలికి వెళ్ళాడు.

పదిహేను నిమిషాలు గడిచిపోయాయి.

రాజారావు మేష్టారు కోపంతో, ఆవేశంతో ఊగిపోతున్నాడు.

"ఏమి దరిద్రమండీ ఇది! మీరు ఇదిగో రేపు మాపు అంటూ రమ్మన్నప్పుడల్లా వస్తూనే వున్నానుకదా! మీక్లర్కు నా పి.యఫ్. లెక్కలు ఎంతకూ తేల్చడు. మీరు పట్టించుకోరు. నా పెన్షన్ ఇంకా తేలనేలేదు. ఎలా బతకమంటారు...?"

"రాజారావుగారూ! అలా ఆవేశ పడిపోకండి! మీ డబ్బు ఎక్కడికీపోదు. ఆ పాత లెక్కల గొడవ ఎంతకూ తేలడంలేదు. ఇంకా స్త ఓపిక పట్టండి. ఇంతపెద్ద స్కూలు మేడ-మేమువుండగా మీకెందుకండిభయం." అని గంభీరంగా భగీరథస్వామిగారు హామీ ఇచ్చే ధోరణిలో నచ్చజెపుతున్నాడు.

ప్రకాశం మధ్యలో కలుగ జేసుకుని అన్నాడు - "ప్రిన్సిపాల్‌గారు, ఎంత కాలం ఒక అమాయకున్ని ఇలాహైరానా పెడతారు? మీ దృష్టిలో టీచర్లు అంటే ప్రాణం లేని గోడలు - సిమెంటు - ఇసుకే తప్ప - వాళ్ళకు ప్రాణాలు వుంటాయి - ఆవసరాలుంటాయని విస్మరిస్తున్నారు."

ప్రిన్సిపాల్ భగీరథస్వామి కొంచెం కోపంగా - "ప్రకాశం! ఎవరితో మాట్లాడుతున్నావో కొంచెం వొళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు! మీ డబ్బును స్కూలు ఏమైనా మింగేస్తున్నదా?"

అప్పుడు రాజారావు మరింత కోపంతో వణికి పోతూ "మింగకపోతే ఏం చేస్తున్నట్టు మీరు? ఒక మాములు పాత పి.యఫ్ లెక్క తేల్చడానికి ఇంతకాలమా? మీకు - మీ స్కూలుకు చాకిరి చేసినంతకాలం ఆదర్శ ఉపాధ్యాయుడు - మాకు రావలసిన దాని గురించి అడిగితే అలా ఎగిరి పడతారేంటి? ఈ ముసలాడిని ఇలా తిప్పడం న్యాయమేనా?..." తారస్థాయితో గొంతు హెచ్చించాడు. మనిషి నిలువునా వణికి పోతున్నాడు. ప్రకాశం ఆయన పరిస్థితిని గమనించి పక్కనే వున్నబెంచిపై కూచో బెట్టాడు.

"ప్రకాశం నాకేదో గుండెలో నొప్పిగా వుందయ్యా. కాస్సేపు విశ్రాంతి కావాలి..." అంటూ నిస్సత్తువుగా బెంచిపైకి వొరిగాడు రాజారావు. ప్రకాశం ఆయన చేతి బ్యాగును తల దగ్గరే పెట్టి పడుకోబెట్టాడు - ఈలోగా భగీరథస్వామి బయటికి వచ్చి ప్యూన్‌ను కేక వేసాడు. "వెంటనే వెళ్ళి పక్క వీధిలో వున్న డాక్టర్‌ను వెంటబెట్టుకురా." అని పురమాయిస్తున్నాడు,

లోపల రాజారావు మేష్టారు కళ్ళు తేలిపోతున్నాయి. క్షీణిస్తున్న స్వరంతో ప్రకాశం చెయ్యి పట్టుకున్నారు. ప్రకాశం ఆయన గుండెలపై అరచేయితో రాస్తున్నాడు.

"ప్రకాశంబాబు! ఇక లాభం లేదయ్యా నా డబ్బులు లెక్క తేల్చి ఆ మొత్తాన్ని మీ ఉపాధ్యాయ సంఘం నిధిలో వుంచండి. పబ్లిక్ పరిక్షలో ప్రతియేటా ఇంగ్లిషు సబ్జెక్ట్‌లో మనస్కూలులో ఎక్కువ మార్కులు తెచ్చుకునే వాడికి అందులోంచి బహుమానం ఇవ్వండి ...." రాజారావు అలా చెబుతూనే ఆగిపోయాడు. సగం మూసుకున్న కళ్ళు అలానే నిలిచి పోయాయి...

కాస్సేపటికి డాక్టరు లోపలికి హడావుడిగా ప్రవేశించాడు. రాజారావు నాడిని పరీక్షించాడు... "ఆలస్యమై పోయింది... ఆయన ప్రాణాలు వదిలేసారు" అని డాక్టరు తన స్టెతస్కోపు సర్దుకుంటు చెప్పారు.

బయట యధావిధిగా లంచ్ టైమ్ గంట మోగింది. పిల్లలంతా మళ్ళీ జలపాతంలా దూకుతూ పైనుంచి వచ్చేస్తున్నారు. •••